క్లుప్తంగా

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ మహేష్‌కుమార్ తెలిపారు. కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కార్యక్రమం నిర్వహిస్తామని చెప్పారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని కోరారు. మండలస్థాయి అధికారులు హాజరుకావాలని సూచించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

బంగారుపాళెం: మండల కేంద్రంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు మురళీకృష్ణ ఆదివారం తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు కంటి రోగులకు పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు రెండు గ్రామాల్లో ఫ్యామిలీ డాక్టర్

ఐరాల: మండలంలోని పొలకల రెడ్డివారిపల్లె, పేరయ్యగారిపల్లెలో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఉదయం పొలకల రెడ్డివారిపల్లెలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, పేరయ్యగారిపల్లెలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తామని తెలిపారు. రెండు గ్రామాల్లో గర్భిణులకు బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె సంబంధిత పరీక్షలు చేసి తగు సూచనలు, సలహాలు ఇస్తామన్నారు. ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నాలుగు గ్రామాల్లో..

తవణంపల్లె: మండలంలోని నాలుగు గ్రామాల్లో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక తెలిపారు. మండలంలోని పల్లెచెరువు, టి.పుత్తూరు, గోవిందరెడ్డిపల్లె, పైమాఘం గ్రామా ల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి గ్రామాల్లోని పేదలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ప్రజలు ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

భక్తులతో బోయకొండ కిటకిట

చౌడేపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వివిధ వాహనాల్లో తరలి వచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేక అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. వేసవి సెలవుల్లో చివరి ఆదివారం కావడంతో విద్యార్థులు, యువకులు, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయంలో క్యూలన్నీ కిక్కిరిసాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనెదీపాలు, దీవెలతో మేళతాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు.



భక్తులతో నిండిపోయిన క్యూలు

హనుమా.. సమస్యలు కనుమా!



అర్ధగిరిలో సహజ సిద్ధమైన సంజీవరాయ పుష్కరిణి



తిరునామం

- అభివృద్ధికి నోచుకోని అర్ధగిరి క్షేత్రం
- భక్తులకు వసతులు కరువు
- కంపు కొడుతున్న మరుగుదొడ్లు
- శిథిలావస్థలో చైర్మన్ భవనం, కళావేదిక షెడ్డు

తవణంపల్లె: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దుకోవాల్సిన అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం గురించి అధికారులు పట్టించుకోకపోవడంతో ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంలా మారింది. ఆలయ అభివృద్ధి గురించి, భక్తులకు వసతులు, సౌకర్యాలు కల్పించడంలో ఆలయ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పౌర్ణమి వేడుకలు తిలకించడానికి వేలాది మంది భక్తులు వస్తుంటారు. కానీ భక్తుల సంఖ్యకనుగుణంగా సౌకర్యాలు కల్పించడంలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్‌గా పైమాఘం సురేంద్రరెడ్డి పదవీకాలం ఏడాది క్రితం ముగిసింది. అప్పటి నుంచి కర్నూలు, నంద్యాల జిల్లాల్లోని గ్రూపు టెంపుల్స్ ఆలయాల కార్యనిర్వహణాధికారిని అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానం ఇన్‌చార్జి ఈఓగా కొనసాగుతున్నారు.

నీడనిచ్చే చెట్టే లేదు

ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి క్షేత్రానికి పలు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేస్తున్నారు. కానీ భక్తులకు అనువైన వసతులు, సౌకర్యాలులేక, సేదతీర్చుకోవడానికి చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించకపోవడంతో భక్తులు స్వామిని దర్శించుకున్న వెంటనే తిరిగిపయనమవుతున్నారు. అర్ధగిరిలో విశాలమైన స్థలం ఉన్నా నీడనిచ్చే చెట్లు పెంచడం, పార్కును ఏర్పాటు చేయడంపై అధికారులు దృష్టి సారించడం లేదు.

నాణ్యతలేని ప్రసాదాలు

అర్ధగిరి క్షేత్రంలో నాణ్యతలేని ప్రసాదాలు విక్రయించడంలేదని భక్తులు మండిపడుతున్నారు. ఆలయంలో ప్రసాదాలు చేయడానికి ప్రత్యేకంగా అర్చకుడిని నియమించారు. ఎనిమిదేళ్ల క్రితం ఆయన ప్రమాదంలో మరణించారు. అప్పటి నుంచి ప్రసాదాల తయారీకి ఎవరినీ నియమించలేదు. దీంతో పులిహోర రుచికరంగా నాణ్యతగా లేదని భక్తులు ఆ ప్రసాదాలను కోతులకు ఆహారంగా వేస్తున్నారు. పులిహోర, లడ్డూలు తగిన బరువు, రుచి లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. స్వామిని దర్శించుకోవడానికి విచ్చేసిన భక్తులకు నాణ్యత కలిగిన ప్రసాదాలు విక్రయించాలని కోరుతున్నారు.

కానరాని పారిశుధ్యం...

ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతున్న శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం 40కి పైగా మరుగుదొడ్లు నిర్మించారు. వాటిని శుభ్రం చేయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. పుష్కరిణి చుట్టూ గడ్డి పెరిగి అపరిశుభ్రంగా ఉంది. ప్రతి నెలా పౌర్ణమి రోజు ప్రాకారోత్సవం చేయడానికి కూడా భక్తులు ఇబ్బందిపడుతున్నారు.



నీటి కొళాయి వద్ద పేరుకుపోయిన పాచి

శిథిలమైన కళావేదిక

అర్ధగిరి క్షేత్రంలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన కళావేదిక పైకప్పు పూర్తిగా దెబ్బతిని వర్షాలకు ఉరుస్తోంది. ఆలయానికి వచ్చే భక్తులు సేదతీర్చుకోవడానికి షెల్టర్‌లేక ఇబ్బందులు పడుతున్నారు. క్షేత్రంలో దాతలచే భక్తులను ఆకర్షించే విధంగా లైటింగ్‌తో తయారు చేసిన తిరునామం మరమ్మతులకు గురైంది. కనీసం దాన్ని కూడా ఎవరూ పట్టించుకోలేదు.

ఆలయ అభివృద్ధికి కృషి చేస్తా



అర్ధగిరి క్షేత్రంలో భక్తులకు మెరుగైన వసతులు కల్పనకు కృషి చేస్తా. దాతల సహకారంలో కొండపై పార్కు ఏర్పాటుకు ప్రయత్నిస్తా. భక్తులకు నాణ్యంగా, రుచికమైన ప్రసాదాలు అందిచండానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం. క్షేత్రంలో పారిశుధ్య చర్యలు మెరుగుపరుస్తాం.

- హనుమంతురావు, ఈఓ, అర్ధగిరి క్షేత్రం

రుచికరమైన ప్రసాదాలు అందించాలి



అర్ధగిరి ఆలయం పవిత్రమైనది. కానీ భక్తులకు సరైన వసతులు లేవు. పులిహోర, లడ్లు కూడా ప్రసాదాలు కూడా లభించడం లేదు. సంజీవరాయ పుష్కరిణి తీర్థం పట్టుకోడానికి కొళాయిలు పనిచేయడం లేదు. ఆలయ అధికారులు భక్తుల మనసోభావాలు దెబ్బతినకుండా పని చేయాలి.

- కిరణ్, భక్తుడు, బెంగళూరు



అర్ధగిరి శ్రీ వీరాంజనేయ స్వామి దేవస్థానం



శిథిలావస్థకు చేరిన ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ భవనం



మరమ్మతులకు నోచుకోని సాంస్కృతిక కళావేదిక

కుప్పం విద్యాశాఖ ఖాళీ!



కుప్పంలోని మండల పరిషత్ కార్యాలయం

- బదిలీలతో స్వస్థలాలకు వెళ్లేందుకు మొగ్గు చూపుతున్న టీచర్లు
- 1,220 మంది బదిలీలకు దరఖాస్తు
- భర్తీ కావాల్సిన టీచర్ పోస్టులే 650 వరకూ ఖాళీ!

కుప్పం: నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 434 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 1,670 మంది టీచర్లు ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్నారు. వీరిలో బదిలీలకు 1,220 మంది దరఖాస్తు చేశారు. కుప్పం మండలంలో 565 మంది, శాంతిపురం మండలంలో 283, గుడుపల్లె 176, రామకుప్పం 184 మంది చొప్పున వీరిలో ఉన్నారు. వీరంతా బదిలీలైన పక్షంలో టీచర్ల కొరత ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉంటోంది.

50 శాతం బదిలీలు

దరఖాస్తు చేసుకున్న వారిలో 50 శాతం వరకు బదిలీ చేయనున్నటుధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రైమరీ, ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్న చోట రిలీవర్ వచ్చేంత వరకు ఒకరిని బదిలీ చేసి, మరొకరిని అక్కడే ఉంచుతారు. డీఎస్సీ పూర్తయిన తరువాత కొత్తగా వచ్చే పూర్తి స్థాయిలో జాయిన్ అయితే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయనున్నట్టు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. నాలుగు మండలాల్లో ఇప్పటికే ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులు 650 మేరకు భర్తీ చేయాల్సి ఉంది.. ఇప్పుడు చేసిన బదిలీలు, డీఎస్సీతో నూతన పోస్టింగ్‌లతో కుప్పం నియోజకవర్గంలో ఉపాధ్యాయుల కొరత తీరుతుందా? అనేది వేచిచూడాల్సి ఉంది.

అరకొరగా విత్తన కాయల పంపిణీ

ఐరాల: రైతులకు ఖరీఫ్‌లో ప్రధాన పంట వేరుశనగ. ఈ సీజన్‌లో వేరుశనగ విత్తనాలకు అధిక డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో వేరుశనగ పంట సాగుకు రైతులకు అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం అండగా నిలబడాల్సి ఉంది. అయితే కూటమి ప్రభుత్వం వేరుశనగ విత్తన కాయలను మండలానికి నామమాత్రంగా కేటాయించండంతో రైతులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ మేరకు విత్తన కాయలను కేటాయించకపోవడంతో రైతులు అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. నామమాత్రంగా విత్తన కాయలను కేటాయించడమేంటని ఆందోళన చెందుతున్నారు.

అరకొర కేటాయింపులే

మండలానికి గత ఏడాది ఖరీఫ్‌లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విత్తన వేరుశనగ కాయలు 1,740 క్వింటాళ్లు కేటాయించింది. అయితే కూటమి ప్రభుత్వం కేవలం 1,100 క్వింటాళ్ల విత్తన కాయలను మాత్రమే కేటాయించింది. దీంతో రైతులకు పూర్తి స్థాయిలో విత్తన కాయలు అందడం గగనంగా మారిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం

కూటమి ప్రభుత్వం డిమాండ్ మేరకు విత్తన కాయలను పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం రైతులకు విత్తన కొరత డిమాండ్ అధికంగా ఉంది. ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనంపైనే ఆధారపడ్డారు. ఈ నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తన కాయలను పంపిణీ చేస్తేనే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. లేకపోతే వేరుశనగ పంట సాగు పూర్తిగా తగ్గే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వం గరిష్ఠంగా 3 బస్తాల విత్తన కాయలు కాకుండా 5 బస్తాల విత్తన కాయలు అందించాలని రైతులు కోరుతున్నారు. డిమాండ్ మేరకు కూటమి ప్రభుత్వం విత్తన వేరుశనగ కాయలను కేటాయించకపోతే ప్రభుత్వం రైతుల ఆగ్రహానికి గురికావడం ఖాయమన్న చర్చ మొదలైంది.



ఆర్‌ఎస్‌కేలో నిల్వ చేస్తున్న విత్తన వేరుశనగ కాయలు(ఫైల్)

బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి



డిమాండ్ మేరకు విత్తనం అందిస్తేనే పూర్తి స్థాయిలో పంట సాగుకు అవకాశం ఉంటుంది. లేకపోతే విత్తన కొరతతో తమ భూములను బీడు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. సబ్సిడీ వేరుశనగ విత్తన కాయలను గరిష్ఠంగా 5 బస్తాలు అందించాలి. నామమాత్రంగా విత్తనం అందిస్తే వేరుశనగ పంట సాగు చేయడం కష్టంగా మారుతుంది.

- విజయమ్మ, సవటపల్లె, ఐరాల

అవసరమైన విత్తనం అందించాలి



కూటమి ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తన వేరుశనగ కాయలను అందించాలి. లేకపోతే రైతులు విత్తనం కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. విత్తన కొరత అధికంగా ఉంది. సబ్సిడీ విత్తనంపైనే ఆధారపడ్డాం. కూటమి ప్రభుత్వం ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా అవసరమైన నిత్తన వేరుశనగ కాయలను అందించి ఆదుకోవాలి.

- అమర్‌నాథ్, రైతు, పుల్లూరు, ఐరాల

మట్టి పరీక్షలతో అధిక దిగుబడులు

భూసార పరీక్ష.. పంటలకు రక్ష

- వృథా ఖర్చులను ఆదా చేసుకోవచ్చు
- అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ఐరాల: భూములు ఆరోగ్యంగా ఉంటే నాణ్యమైన దిగుబడులు అందుకోవచ్చు. అందుకు రైతులు భూసార పరీక్షలు చేయించుకొని ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే వృథా ఖర్చులను ఆదా చేసుకోవచ్చు. వ్యవసాయ భూముల్లో సహజంగా ఉండే పోషక పదార్థాలతో పాటు అదనంగా సేంద్రియ ఎరువులు అందించి మొక్కలకు మరిన్ని పోషకాలు ఇవ్వగలిగితే అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. రైతులు నేలను కాపాడుకోవడానికి భూసార పరీక్షలు ఎంతో ఉపయోగకంగా ఉంటాయి. సుస్థిర దిగుబడులు పొందడానికి రైతులు ఏటా భూసార పరీక్షలు చేయించుకుంటే ఎంతో మేలు. భూమిలో ఉండే పోషక పదార్థాలతో చౌడు గుణాలు, సున్నపు శాతం, నేల కాలుష్యాన్ని గుర్తించేందుకు భూసార పరీక్షలు దోహదపడతాయి. పరీక్షలు చేస్తే ఫలితాలను బట్టి ఏఏ పోషకాలు అవసరమో తెలుస్తుందని, దీనిని బట్టి పంటలు దిగుబడులు చాలా వస్తాయని పేర్కొంటున్నారు. రైతులు భూసార పరీక్షలు చేయించుకొని. పచ్చిరొట్ట సాగు చేసి భూసారం పెంచుకోవాలని స్పష్టం చేస్తున్నారు.

శ్రద్ధ లేకపోవడంతో నష్టం

కాలక్రమేణా సాగులో భారీ మార్పులు చేసుకుంటున్నాయి. వ్యవసాయాధికారులు సాగులో మెలకువలు నేర్పుతున్నప్పటికీ కొంత మంది కర్షకులు నిర్లక్ష్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుత వానాకాలం సాగుపై అన్నదాతలు దృష్టి సారించారు. కానీ భూమిలో పోషకాలు స్థాయి తెలుసుకునేందుకు శ్రద్ధ చూపడం లేదు. విరివిగా రసాయన ఎరువులు వాడుతూ సాగు చేస్తుండడంతో భూమిలో పోషక విలువలు తగ్గి ఆశించిన మేర దిగుబడులు రాక నష్టపోతున్నారు. సాగులో సందేహాలను వ్యవసాయాధికారులు నివృత్తి చేస్తున్నారు. పంటల మార్పిడి, నీటి పొదుపు, బిందు, తుంపర సేద్యం చేయాలని సూచిస్తున్నారు. భూసార పరీక్షలు చేయించుకోవాలని తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించాలని కోరుకుంటున్నారు. అందుకు తగిన సూచనలు, సలహాలు ఇస్తున్నారు. ఇదిలా ఉండగా భూసార పరీక్షలకు కొందరు రైతులు మొగ్గు చూపకపోగా పరీక్ష చేయించిన వారికి వ్యవసాయాధికారులు సమయానికి ఫలితాలు అందించడం లేదనే విమర్శలు కూడా లేకపోలేదు.



మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

ఫలితాల ఆధారంగా అధిక దిగుబడి

భూసార పరీక్షలు చేయించుకుని వాటి ఫలితాల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. మొక్కల పెరుగుదలకు 16 రకాల పోషకాలు అవసరమని, భూసార పరీక్షల ద్వారా భూమిలో లవణ పోషకాలు, నత్రజని, భాస్వరం, పొటాష్‌ల లభ్యతను తెలుసుకునే అవకాశం ఉంటుంది. దీంతో అవసరమైన మోతాదులో ఎరువుల వినియోగానికి అవకాశం ఉంటుంది. కొందరు రైతులు ఒకే పంటను తరుచుగా సాగు చేస్తుండడంతో అధిక రసాయన ఎరువులు వినియోగిస్తుండడంతో భూమి సారం కోల్పోయి పంటల దిగుబడి తగ్గుతుంది.

మట్టి నమూనా సేకరణలో జాగ్రత్తలు

భూసార పరీక్షలు చేయించుకోవడానికి ముందుగా మట్టి సేకరణ గురించి తెలుసుకోవాలి. మట్టి నమూనా సక్రమంగా లేకపోతే భౌతిక, రసాయనిక, జీవ లక్షణాల అంచనా సక్రమంగా ఉండదు. ఇటువంటి సమయంలో నిపుణుల నుంచి కొన్ని సందర్భాల్లో పంట సమస్యలపై సరైన సిఫార్సులు అందుకోలేం. పెట్టుబడి ఖర్చులు సైతం పెరిగి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు తప్పవు. అందుకే మట్టి నమూనా సేకరణలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

ప్రతి రైతుకూ అవగాహన కల్పిస్తున్నాం



ఏటా మట్టి పరీక్షలు చేయించాలి. తద్వారా నేలతల్లి ఆరోగ్యం తెలుస్తుంది. ఆ మేరకు కావాల్సిన పోషకాలను ఇవ్వగలిగే ఎరువులు వాడుకునే అవకాశం ఉంది. సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు రైతులు తప్పకుండా పాటించాలి. భూసార పరీక్షల ఫలితాల ఆధారంగా సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయి. సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలి. భూసార పరీక్షలపై ప్రతి రైతుకు అవగాహన కల్పిస్తున్నాం.

- వరలక్ష్మి, ఏఓ, ఐరాల

నేత్ర పర్వం..ద్రౌపదీ కల్యాణం

కార్వేటినగరం: మండలంలోని కొల్లాగుంటలో నిర్వహిస్తున్న మహా భారత వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం ద్రౌపదీ, ధర్మరాజుల కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేక వాహనంపై కొలువుదీర్చి గ్రామ వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగించారు. మొక్కులున్న భక్తులు అమ్మవారికి వడిబాల, కర్పూర నీరాజనాలు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కళ్యాణ వేదిక వద్ద కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ వేద పండితులు నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను పట్టు వస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో అలంకరించారు. కల్యాణోత్సవంలో దంపతులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించారు. వారికి ప్రసాదం, సారెను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు, ధర్మకర్తలు, అర్చకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.